క్లుప్తంగా

వంట సామగ్రి అందజేత



హైస్కూల్ ప్రతినిధులకు వంట సామగ్రి అందజేస్తున్న శాఖరి శ్రీనివాస్

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అవసరాలకు వంట సామగ్రిని సోమవారం పాఠశాల యాజమాన్యానికి స్థానిక నాయకుడు శాఖరి శ్రీనివాస్ అందజేశారు. పాఠశాలకు, విద్యార్థులకు భవిష్యత్‌లో ఎలాంటి అవసరమున్నా సహాయపడతానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



విద్యార్థిని దంతాలు పరీక్షిస్తున్న వైద్యురాలు

భీమునిపట్నం : స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం దంత పరీక్షలు నిర్వహించారు. అనిట్స్ దంత వైద్య కళాశాల డాక్టర్లు ప్రహర్ష, విపిన్, కీర్తన, మనీషా తదితరులు పాఠశాలలోని 240 మంది విద్యార్థులను పరీక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులకు దంత సంరక్షణ ఎంతో అవసరమని, చేయించుకోకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వుంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు అల్లాడి శ్రీనివాసరావు, సుజాత కుమారి, వెంకటరావు, రామకృష్ణ, లక్ష్మి, లావణ్య పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న ఎస్‌ఐ చిన్నమనాయుడు

భీమునిపట్నం : మాదక ద్రవ్యాలు వినియోగించడం ప్రారంభిస్తే జీవితాలు సర్వ నాశనమవుతాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సబ్ ఇన్‌స్పెక్టర్ చిన్నమనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతోందని, ఇది చాలా ఆందోళనకర విషయమన్నారు. యువతకు అవగాహన లేకపోవడం వల్ల వాటికి బానిసలవుతున్నారన్నారు. ఇది ఏమాత్రం మంచిది కాదని... చదువు, ఆరోగ్యం నాశనమైపోతుందన్నారు. విద్యార్థులంతా చక్కగా చదువుకుని ఉజ్వల భవిష్యత్ సొంతం చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు రమణ, కానిస్టేబుళ్లు వీరభద్రరావు, దేముడు రాజు పాల్గొన్నారు.

విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం జరిపారు. అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను బేడామండపంలోని వేదికపై అధిష్టింపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

నిరాటంకంగా ఆక్రమణ దందా

- టీడీపీ నాయకుల అండతో ప్రభుత్వ భూమిలో షెడ్ల నిర్మాణం
- మధురవాడ సర్వే నంబరు 27లో ఆక్రమణలు
- గత నెలలో పరిశీలించి వెళ్లిపోయిన అధికారులు
- ఇప్పటికీ చర్యలు చేపట్టేందుకు వెనుకడుగు



మధురవాడ శ్రీలక్ష్మీనగర్ కొండపై అక్రమంగా నిర్మించిన షెడ్లు



మధురవాడ శ్రీలక్ష్మీనగర్‌లో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న షెడ్లు

మధురవాడ : విశాఖ రూరల్ మండలం మధురవాడలో టీడీపీ నాయకుల అండదండలతో ఆక్రమణల పర్వం కొద్ది రోజుల నుంచి నిరాటంకంగా కొనసాగుతోంది. కొమ్మాది జంక్షన్ నుంచి శివశక్తినగర్‌కి వెళ్లే రోడ్డులో మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు – 27 శ్రీలక్ష్మీనగర్‌లో కొందరు టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే సుమారు ఎకరం స్థలంలో 20కి పైగా ఆర్‌సీసీ రేకుల షెడ్ల నిర్మాణం నెలున్నర రోజులుగా కొనసాగుతోంది. దీనికి స్థానిక టీడీపీ ప్రధాన కార్యకర్తలే సూత్రదారులని విమర్శలు గుప్పుమంటున్నాయి. మాస్టర్ ప్లాన్ రోడ్డుకి, వుడా ఏర్పాటు చేసిన ఎంతో విలువైన లే అవుట్ ఉన్న కొండ కింది భాగంలో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుంటే రెవెన్యూ, జీవీఎంసీ అధికారులకు చీమ కుట్టినట్టు అయినా లేకపోవడం గమనార్హం. వీరి నిర్లక్ష్యం కారణంగా కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమికి రెక్కలు వచ్చేస్తున్నాయి.

పాత నిర్మాణాలని నమ్మించేందుకు...

అధికార యంత్రాంగం అంతా ఎన్నికలు విధుల్లో ఉండగా ఓట్లు కోసం ఎవరూ అడ్డు చెప్పరని గ్రహించిన కొందరు శివశక్తినగర్ కొండ కింది భాగంలో భూమిని చదును చేసి గతంలో షెడ్ల నిర్మాణం ప్రారంభించారు. దీన్ని ఎవ్వరూ అదుపు చేసేందుకు కనీసం ప్రయత్నం కూడా చేయకపోవడంతో అక్రమణదారులు మరింత ధైర్యంగా ముందుకు సాగారు. కొండను ఆనుకుని ఉన్న ఎవరి ఇంటికి ముందున్న ప్రభుత్వ స్థలం వాళ్లదే అన్నట్టు పేదల పేరుతో బినామీలు పుట్టుకొచ్చి షెడ్లు నిర్మించేస్తున్నారు. ఇక్కడ చేపట్టిన అక్రమ నిర్మాణాలు అన్నీ పాతవేనని అధికార యంత్రాంగాన్ని నమ్మించేందుకు పాత ఇటుకలు, తలుపులు, కిటికీలు, చివరకు కొందరైతే రేకులు కూడా స్క్రాప్ దుకాణాల్లో కొనుగోలు చేసి పక్కా ప్రణాళికతో నిర్మాణాలు చేస్తున్నారు.

పరిశీలనకే అధికారులు పరిమితం

కోట్ల రూపాయల విలువ చేసే భూమి అక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోతుంటే రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు పోలీసు రక్షణలో నెల రోజుల కిందట వచ్చి పరిశీలించి వెళ్లిపోయారు. మరోవైపు ఎన్నికల విధుల కోసం వచ్చిన ఉన్నతాధికారులు తాము వేరే ప్రాంతాలకు బదిలీ అయిపోతామని... అధికార టీడీపీ నాయకుల ఆదేశాలకు భిన్నంగా వ్యవహరిస్తే తాము కోరుకున్న చోట పోస్టింగ్ వసుందో...? రాదోనని..? ఆక్రమణలను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం అంతా ఎమ్మెల్యే పేరు చెప్పి టీడీపీ 5వ వార్డుకు చెందిన ముఖ్య నాయకులే నడిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గత నెలలో ఇక్కడ ఆక్రమణల తొలగింపునకు రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు పోలీసు రక్షణతో పొక్లెయిన్‌తో వచ్చినా కూడా ఆక్రమణదారులు ప్రతిఘటించడంతో వెనుదిరిగారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తి స్థాయిలో ఆక్రమణలు తొలగిస్తామని రాజకీయ నాయకులు వలే అధికారులు ప్రకటనలు గుప్పించారు తప్ప తర్వాత ఇటువైపు చూడనే లేదు. జీవీఎంసీ జిల్లా అధికారులైనా తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

గుట్టుగా విద్యుత్ కనెక్షన్లు

ప్రభుత్వ భూమిలో అక్రమంగా పుట్టుకొస్తున్న షెడ్లకు విద్యుత్ కనెక్షన్లు కూడా అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి విద్యుత్ శాఖ సిబ్బంది గుట్టుగా ఇచ్చేస్తున్నారు. ఈ విషయమై విశాఖ రూరల్ మండల తహసీల్దార్ ఎన్.శివన్నారాయణను వివరణ కోరగా మధురవాడ సర్వే నంబరు 27 శ్రీలక్ష్మీనగర్‌లో ఆక్రమణల విషయం తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. సదరు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామని, వారి వద్ద ఉన్న ఆధారాలు, పత్రాలు పట్టుకుని రమ్మని చెప్పామని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు చేపడతామని తెలిపారు.



శ్రీలక్ష్మీనగర్ వద్ద కొండపై షెడ్ల నిర్మాణానికి సిద్ధం చేసిన బేస్‌మెంట్‌లు

అందరి సహకారంతో వైఎస్సార్ సీపీ బలోపేతం

- ఓపికతో ధైర్యంగా ముందుకు సాగుదాం
- పార్టీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గం పరిధిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. తన క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికి గతంలో ఎవరూ చేయని విధంగా ఎంతో మేలు చేశారని గుర్తు చేశారు. అయినప్పటికి మెజారిటీ ప్రజలు ఓట్లు వేయలేదని, అయినా దేశంలో ఎక్కువ ఓట్లు సాధించిన ఏకైక పార్టీగా వైఎస్సార్‌సీపీ నిలిచిందన్నారు. స్థానిక సంస్థల్లో కూడా మనమే అగ్రస్థానంలో ఉన్నామన్నారు. నియోజకవర్గ పరిధిలో కూడా ఎన్నో మంచి పనులు చేయడంతోపాటు తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నా ఓడిపోయానన్నారు. ఓడిపోయామని ఎవరూ అధైర్యపడవద్దని, తిరిగి బలాన్ని పుంజుకుంటామని, అన్ని ప్రాంతాల్లోను బాగా పని చేద్దామని పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడినా ఓపిక వహించాలని, ప్రజల తీర్పును గౌరవించాలని సూచించారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలను ఏ మేరకు నెరవేరుస్తారో వేచి చూద్దామన్నారు.

గతంలో ఎక్కడ ఏ మేరకు పొరపాట్లు జరిగాయో చూసుకుని వాటిని సరి చేసుకుని తగిన విధంగా పని చేద్దామన్నారు. ముఖ్యంగా గెలుపు, ఓటములు సహజమని, అందరం కలిసికట్టుగా ముందుకు సాగితే పూర్వ స్థితికి చేరుకుంటామన్న విషయాన్ని అందరూ దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. సమావేశంలో జీవీఎంసీ 4వ వార్డు కార్పొరేటర్ దౌలుపల్లి ఏడుకొండలు, పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, నాయకులు ఎస్.కరుణాకర రెడ్డి, వాసుపల్లి కొండబాబు, జీరు వెంకటరెడ్డి, భాస్కరరెడ్డి, రోశిరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 9 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ శైలజావల్లి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటరావు

మధురవాడ : జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జోనల్ కమిషనర్ శైలజావల్లి సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీటిలో టౌన్ ప్లానింగ్ – 2, పబ్లిక్ వర్క్స్ – 3, నీటి సరఫరా 3, రెవెన్యూ విభాగం నుంచి ఒక అర్జీ అందాయి. తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎం.సత్య భాస్కరరావు, డి.రామారావు, పిళ్లా సూరిబాబు, పిళ్లా వేణుగోపాలరావు కోరారు. ఇంటి పన్ను సమస్య పరిష్కరించాలని అల్లాడ వెంకటరావు, కాల్వలు మరమ్మతులు చేయించాలని ఎన్.వెంకట పార్వతీశం, ప్రభుత్వ ఆస్తి పరిరక్షించాలని గౌరి అర్జీలు ఇచ్చారు. వీటిపై చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు.

పద్మనాభం : పద్మనాభం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఐదుగురు అర్జీలు సమర్పించారు. భూ సమస్యలు పరిష్కరించాలని వీరంతా దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ ఎస్.వెంకటరావు ఫిర్యాదులు స్వీకరించారు.

పేదల పాకలు తొలగింపు



తొలగించిన కల్వర్టుపై నిర్మించిన శ్లాబు



రోదిస్తున్న నరసయ్యమ్మ, కుటుంబీకులు

పద్మనాభం : పేదలమైన తమకు ముందుస్తు సమాచారం ఇవ్వకుండా రెవెన్యూ సిబ్బంది తమ పాకలు, షెడ్లు తొలగించడానికి రావడం ఎంత వరకు సమంజసమని తునివలసకు చెందిన పి.నరసయ్యమ్మ, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. తునివలసలో జగనన్న కాలనీకి సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ఐదుగురు పాకలు, ఇద్దరు షెడ్లు నిర్మించుకుని చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నారు. అయితే జగనన్న కాలనీలోని రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌కు వెళ్లడానికి మార్గం లేకుండా వీరు షెడ్లు, పాకలు వేశారని ఇదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తహసీల్దార్‌కు కొద్ది రోజుల కిందట ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ సిబ్బంది పొక్లెయిన్ తీసుకెళ్లి పాకలు తొలగించారు. షెడ్లు నిర్మించుకోవడానికి కల్వర్టు కట్టి నిర్మించిన శ్లాబును తొలగించారు. అనంతరం షెడ్లు తొలగించడానికి వెళ్లగా బతుకు తెరువు కోసం వేలాది రూపాయలు అప్పులు చేసి టీ, టిఫిన్ అమ్ముకోవడానికి నిర్మించుకున్న షెడ్లను ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా ఎలా కూలుస్తారని బాధితులు రెవెన్యూ సిబ్బందిని నిలదీశారు. దీంతో 24 గంటల్లోగా షెడ్లు తొలగించుకోవాలని రెవెన్యూ సిబ్బంది సమయమిచ్చారు. అధికారులు తీరుతో బాధితులు రోదిస్తున్నారు.

గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్ అధికారుల దాడి



స్వాధీనం చేసుకున్న లారీ, పొక్లెయిన్

తగరపువలస : ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ ఎన్టీఆర్ కాలనీ సర్వే నంబర్ 207లోని జట్లమ్మకొండపై అనుమతి లేకుండా గ్రావెల్ తరలిస్తున్న లారీని, పొక్లెయిన్‌ను మైనింగ్ అధికారులు పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న కొండ ప్రాంతానికి ఆర్ఐ శైలజ చేరుకుని 50 క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించినట్టు గుర్తించి సంబంధిత యజమానికి రూ.33 వేల జరిమానా విధించారు. అనుమతులు లేకుండా గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెతోపాటు వీఆర్వో అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ఉపాధి కల్పించాలి




ఉప్పాడ అప్పారావును సత్కరిస్తున్న పౌరాణిక కళాకారుడు అప్పలనాయుడు, తదితరులు

తగరపువలస : కళాకారుల ఉపాధికి భద్రత కల్పించాలని ప్రముఖ పౌరాణిక నాటక రంగ నటుడు ఉప్పాడ అప్పారావు డిమాండ్ చేశారు. శ్రీకృష్ణ పాత్రధారి అయిన విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన మరో ప్రముఖ పౌరాణిక నాటక రంగ కళాకారుడు మడక అప్పలనాయుడు సోమవారం ఆనందపురం మండలం పెద్దిపాలెంలో ఉప్పాడ అప్పారావును కలిసి ఘనంగా సత్కరించారు. ఆయన అప్పారావుకు రూ.20 వేల విలువైన శ్రీకృష్ణుని వస్త్రాలు, అలంకరణ దుస్తులు, సామగ్రి అందించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కళలకు ప్రాణం పోస్తూ రక్షిస్తున్న కళాకారుల పట్ల ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో భీమిలి న్యాయశాల ప్రభుత్వ ఏజీపీ మరుపిల్ల చిన్నయపాత్రుడు, ఎంపీటీసీ సభ్యురాలు మరుపిల్ల పద్మజ, గుండు ఎల్లారావు, పోతిన జీవన్, సంతోష్, రమణ, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో సంతపేట వీధులు



సత్యనారాయణస్వామి కొండవైపు వెలగని వీధి దీపాలు



సంతపేటలో వెలగని వీధిదీపాలు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంతపేటలో మూడు రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ఇళ్ల చుట్టుపక్కల, రహదారి మీద చీకట్లు అలుముకున్నాయి. స్థానికులు నిద్రపోయే వరకు ఇంటి నుంచి వెలుగులు ప్రసరిస్తున్నా రాత్రి 10 గంటల తర్వాత ఏమీ కనిపించడం లేదని వాపోతున్నారు. ఈ ప్రాంతంలోని ఎన్టీఆర్ పార్కులో చీకటి పడితే కొందరు ఆకతాయిలు గంజాయి, మద్యం సేవించి చుట్టుపక్కల వారిపై వేధింపులకు, చిల్లర దొంగతనాలకు దిగుతున్నారు. అంతేకాకుండా వీధి కుక్కలు పలువురిపై దాడులకు దిగుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని వీధిదీపాలను పునరుద్ధరించాలని సంతపేట వాసులు కోరుతున్నారు.

స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలి



శిక్షణ కేంద్రంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు

తగరపువలస : స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈ దుర్గాంబ సూచించారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో భీమిలి, పెందుర్తి, ఆనందపురం, పద్మనాభం మండలాల గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు, ఇంజినీర్లకు తాగునీటి సరఫరాపై సోమవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ఎప్పటికప్పుడు నీటి శుభ్రతపై పరీక్షలు జరపాలన్నారు. ఏడాదికోసారి రసాయన పరీక్షలు, రోజూ క్లోరిన్ పరీక్షల ద్వారా నీటి శుభ్రతను గుర్తించాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయకపోతే డయేరియా, తదితర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. శిక్షణా కార్యక్రమంలో 70 మంది సిబ్బందితోపాటు ఏఈలు మూర్తి, సుమ, భాస్కరరావు, చిరంజీవి పాల్గొన్నారు.

గురుకులాల్లో బోధనా సిబ్బంది కొరతపై ఫిర్యాదు

తగరపువలస : ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలని కోరుతూ నగరానికి చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పేద, బలహీన వర్గాల బాలబాలికలకు నాణ్యమైన విద్యతోపాటు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తున్న ఏపీ రెసిడెన్షియల్, సాంఘిక సంక్షేమ గురుకులాలు, జ్యోతీరావు పూలే బీసీ గురుకులాల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా పూర్తిగా బోధన జరగడం లేదన్నారు. చాలాచోట్ల రెగ్యులర్ సబ్జెక్ట్ టీచర్ల నియామకాలు లేనందున అతిథి అధ్యాపకులతోనే కాలం వెళ్లదీస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయిలో బోధనా సిబ్బందిని నియమించి గురుకులాల్లో విద్యా ప్రమాణాల మెరుగునకు కృషి చేయాలని ఆయన కోరారు.

మందుబాబులకు రూ.78 వేల జరిమానా

పీఎం పాలెం : మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడిపిన వారికి న్యాయమూర్తి రూ.78 వేల జరిమానా విధించారు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం... ఇటీవల జాతీయ రహదారిపై నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతున్న 42 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. వారిని సోమవారం న్యాయమూర్తి ముందు హాజరుపరచగా ఒక్కొక్కరికీ రూ.1,000 నుంచి రూ.3 వేలు వంతున మొత్తం రూ.78 వేలు జరిమానా విధించారు.

ఘనంగా చందనం ఊరేగింపు



చందనం ఊరేగింపులో ముఖ్తియార్ అలీ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు అహ్మద్, తదితరులు



గుర్రపు బగ్గీపై ఊరేగిస్తున్న చందనం

మధురవాడ : మధురవాడ శ్రీవల్లినగర్‌లోని హజరత్ ముఖ్తియార్ అలీ చారిటబుల్ ట్రస్ట్ 22వ వార్షిక వేడుకల్లో భాగంగా సోమవారం సంస్థ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్ ఆధ్వర్యంలో చందనం ఊరేగింపు అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రార్థనా మందిరంలో అహ్మద్, అతని కుటుంబ సభ్యులు, ఇతర సంస్థ సభ్యులు ముందుగా ప్రార్థనలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీరి ఆచారం ప్రకారం మధురవాడ శ్రీవల్లినగర్ నుంచి కొమ్మాది జంక్షన్, మారికవలస, పరదేశిపాలెం, బోయిపాలెం, భీమిలి క్రాస్ రోడ్స్ మీదుగా గారిపేట వరకు గుర్రపు బగ్గీపై చందనం ఊరేగించారు. సుమారు 15 కిలో మీటర్ల మేర వస్త్రం నేలపై పరిచి దానిపైనే చందనం బగ్గీని నడిపించడం విశేషం. సాంప్రదాయం ఉట్టిపడేలా ఫకీరు మేళా, పులి వేషాలు, థింసా నృత్యాలు, కోలాటం వంటి ఆధ్యాత్మిక, కళారూపాలు మరింత ప్రత్యేకతను తెచ్చిపెట్టాయి. చందనం ఊరేగింపునకు విశేషంగా తరలివచ్చిన భక్తులతో మధురవాడలో పండగ వాతావరణం నెలకొంది.

ప్రభుత్వాస్పత్రుల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహారాణిపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. జీవో 549 ప్రకారం కార్మికులకు రూ.16 వేల జీతం అమలు చేయాలని, వివిధ కటింగ్‌లు చూపిస్తూ రూ.11,200 మాత్రమే చెల్లిస్తున్నారని యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకటరావు అన్నారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వై.కనకరాజు, డి.రాజేశ్వరి, డి.భాగ్య, కేశవరావు, పోతురాజు, పి.రాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

శివుని ప్రతిరూపమే శంకరాచార్యులు



ప్రవచిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం కుర్తాళం శంకరాచార్యులు, పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ప్రవచనం చేశారు. జగద్గురు శంకర విజయంపై స్వామివారు చేసిన ప్రవచనం ఆద్యంతం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. శంకరాచార్యులు సాక్షాత్ శివుని ప్రతిరూపమని, శంకరుల అవతరణ నాటికి భారతావనిలో ధార్మిక వాతావరణాన్ని వివరించారు. సన్యాసాశ్రమ వైశిష్ట్యాన్ని, జప తప హోమాల గురించి తెలియజేశారు. శంకరులు అద్వైత సిద్ధాంతం ప్రచారం ద్వారా దేశంలో జాతీయ సమైఖ్యతకు దోహదం చేశారని చెప్పారు. శంకరాచార్యులు మహాకవి అని, అపారమైన స్తోత్రవాఙ్మయం, భక్తి సాహిత్యం సృష్టించారని వారి కవిత్వం, బోధనల ప్రభావం నేటికీ సమాజంపై ఉందని అభిభాషించారు. శంకరుల జీవితంలోని పలు సంఘటనలు, ఉదంతాలను సభారంజకంగా ప్రవచించారు. శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని, అశేష భక్తజనం స్వామి వారి భాషణాన్ని ఆలకించి పులకించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.